'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

నమస్తే తెలంగాణ

# హళ్లికి హళ్లి సున్నకు సున్నా

**రాష్ట్రంలోని** కాంగ్రెస్ ప్రభుత్వం బుధవారం నాడు అసెంబ్లీకి సమర్పించిన బడ్జెట్ సాధించిందేమైనా ఉందా అంటే హళ్లికి హళ్లి సున్నకు సున్నా అనే చెప్పుకోవాలి. ఒక కొత్త పథకం లేదు. కొత్త ఆలోచన అసలే లేదు. దశ-దిశ లేని చప్పిడి బడ్జెట్‌లో మొక్కుబడి విదిలింపులతో సరిపెట్టారు. మెగా మాస్టర్ ప్లాన్-2050 గురించి అట్టహాసంగా ప్రకటించుకున్నారు. అంటే వర్తమానంలో ఆర్థికవ్యవస్థను బాగుపరచడం తమ వల్ల కాదని చెప్పకనే చెప్పినట్టుగా ఉన్నది. రంగారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల్లో గ్రీన్ ఫీల్డ్ పారిశ్రామిక వాడల అభివృద్ధికి దీనిని ఉద్దేశించినట్టు కాంగ్రెస్ ప్రభుత్వం చెప్తున్నది. ఆదాయాన్ని పెంచుకోవడంలో దారుణంగా విఫలమైపోయి, అప్పుల మీదనే ఆధారపడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం పదేండ్లలో ఆర్థిక వ్యవస్థను ట్రిలియన్ డాలర్ల స్థాయికి తీసుకువెళ్తామని చెప్పడం హాస్యాస్పదం. ఫ్యూచర్ సిటీ గురించి గొప్పగా చెప్పుకొన్నప్పటికీ కేటాయించిన మొత్తం బహు తక్కువ. 56 గ్రామాలతో కూడిన భవిష్యత్తు నగరికి రూ.100 కోట్లు మాత్రమే కేటాయించడం గమనార్హం. తక్షణ అవసరాలకు నిధులు సర్దలేక, సంక్షేమానికి కేటాయించలేక సతమతమైనట్టు 2025-26 బడ్జెట్‌ను చూస్తేనే అర్థమవుతుంది. వచ్చే ఆర్థిక సంవత్సరం (2025-26) చివరి నాటికి ప్రజా రుణం మొత్తం రూ.5 లక్షల కోట్లు దాటిపోతుంది. ఇది ఆర్థిక నిర్వహణను మరింత కఠినతరం చేస్తుందనడంలో ఎలాంటి సందేహం అక్కరలేదు.

వంద రోజుల్లో ఆరు గ్యారంటీలనే వాగ్దానాన్ని అధికారికంగా భూస్థాపితం చేసేందుకు ప్రభుత్వం ఈ బడ్జెట్‌ను అడ్డంగా వాడుకున్నది. అంటే మాటకూ, చేతకూ పొంతన లేదన్న మాట. పింఛన్లు పెంచలేదు. మహాలక్ష్మి మాటే లేదు. తులం బంగారం గురించి గుంజెత్తు ప్రస్తావన లేదు. గ్యారంటీలతో పాటుగా మొత్తం హామీలన్నింటినీ తుంగలో తొక్కారనడానికి బడ్జెట్ నిదర్శనంగా నిలుస్తుంది. ప్రజల కష్టనష్టాలపై ఏ మాత్రం ధ్యాస పెట్టకుండా ప్రజాధనాన్ని అధికార పార్టీకి పంచిపెట్టే ఎత్తుగడ స్పష్టంగానే కనిపిస్తున్నది. 'రాజీవ్ యువ వికాస్ యోజన' పేరిట రూ.6,000 కోట్లు కేటాయించడమే ఇందుకు నిదర్శనం. ఈ నిధులు అధికార పార్టీ కార్యకర్తలు పప్పుబెల్లాల్లా పంచుకుంటారని విపక్ష బీఆర్ఎస్ ఆరోపిస్తుండటం గమనార్హం. కామారెడ్డి డిక్లరేషన్‌లో ఏటా బీసీ సంక్షేమానికి రూ.20,000 కోట్లు కేటాయిస్తామని చెప్పి కేవలం రూ.11,405 కోట్ల నిధులు కేటాయించడం ఇచ్చిన మాట తప్పడమే అవుతుంది.

కేసీఆర్ ప్రభుత్వం చేనేతకు పెట్టిన బడ్జెట్ రూ.1200 కోట్లు. కానీ, ప్రస్తుత బడ్జెట్లో వారికి రూ.370 కోట్లు మాత్రమే కేటాయించడం చూస్తుంటే సర్కారు ప్రాధాన్యాలు అర్థమవుతాయి. ఇంకా అనేక అంశాలు ప్రస్తావనకైనా నోచుకోలేదు. ఆటోడ్రైవర్ల సంక్షేమ బోర్డు గురించి బడ్జెట్‌లో నామమాత్రంగానైనా ప్రస్తావన లేదు. గిగ్ వర్కర్ల కోసం బోర్డు ఏర్పాటుచేయడం గురించి బడ్జెట్‌లో మాట కూడా లేదు. కేసీఆర్ ప్రభుత్వం ఇచ్చిన 73 శాతం ఫిట్‌మెంట్‌కు మించి ఉద్యోగులకు న్యాయం చేస్తామన్నారు. దాని గురించీ ఏమీ లేదు. పీఆర్సీ మాటేమోగానీ కనీసం పెండింగ్‌లో ఉన్న ఐదు డీఏల గురించీ ఏమీ చెప్పలేదు. గొర్రెల పంపిణీ ఊసే లేదు. వైన్‌షాపుల్లో గౌడ్‌లకు ఇస్తానన్న 25 శాతం రిజర్వేషన్ జాడే లేదు. అంబేద్కర్ అభయహస్తం పేరిట దళితులకు ఇస్తామన్న రూ.12 లక్షలు ఏమయ్యాయో తెలియదు. విద్యార్థులకు రూ.10 లక్షల వరకు వడ్డీలేని రుణం బడ్జెట్‌లో ఎలాంటి కేటాయింపులకూ నోచుకోలేదు. నిరుద్యోగులకు భృతి లేదు. విద్యార్థులకు రూ.5 లక్షల భరోసా కార్డు ప్రస్తావన లేదు. రూ.73 వేల కోట్లు ఆదాయం తగ్గిందని స్వయంగా ముఖ్యమంత్రి చెప్తుంటే బడ్జెట్‌లో మాత్రం అంతా సవ్యంగా ఉన్నట్టు ఎందుకు చెప్తున్నారో ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క సమాధానం ఇవ్వాలి. కల్లబొల్లి కబుర్ల కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ మొత్తం మీద హామీల డుల్లతో డొల్లగా రూపొందిందని చెప్పక తప్పదు.

---

**'విద్య అనేది సింహపు పాల వంటిది. దాన్ని తాగినవాడు గర్జించకుండా ఉండలేడు' అన్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చెప్పిన మాటలను ప్రస్తావిస్తూ రాష్ట్ర ఆర్థికమంత్రి భట్టి విక్రమార్క బడ్జెట్‌లో విద్యారంగ అంశాలను గొప్పగా చెప్పారు. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను, అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్ కేటాయింపులను పరిశీలిస్తే నోటితో నవ్వి, నొసలుతో వెక్కిరించిన చందంగా ఉన్నది.**

# విద్యార్థులను మోసం చేసిన కాంగ్రెస్ సర్కార్

**విద్యారంగం పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన ప్రభుత్వం రాష్ట్ర బడ్జెట్‌లో స్వల్ప నిధులు కేటాయించింది. కాంగ్రెస్ అధికారంలోకి రావడం కోసం విద్యార్థులను, నిరుద్యోగులను కేంద్రంగా చేసుకొని నాడు అలవికాని హామీలిచ్చింది. అధికారంలోకి వస్తే 6 గ్యారెంటీలు అమలు చేయడంతో పాటు విద్యార్థులకు ప్రత్యేక హామీలు కూడా ఇచ్చింది.**



**పి.మహేష్**
97003 46942

విద్యార్థులకు రూ.5 లక్షల భరోసా కార్డు, ప్రతి మండలంలో ఇంటర్నేషనల్ స్కూల్ ఏర్పాటుచేస్తామని హామీ ఇచ్చింది. కానీ, బడ్జెట్‌లో నేడు రూ.5 లక్షల భరోసా కార్డు ఊసే లేదు. మండలానికి ఒక ఇంటర్నేషనల్ స్కూల్ అని చెప్పి, నేడు నియోజకవర్గానికి ఒక ఇంటర్నేషనల్ స్కూల్ ఇస్తామని చెప్పింది. అంతేకాదు, మొదటి విడతలో కొన్ని నియోజకవర్గాలకు మాత్రమే ఇస్తామని పరిమితం చేసింది. ప్రతి మండలానికి గురుకులం ఎస్సీ, ఎస్టీ రెసిడెన్సియల్ స్కూల్ ఏర్పాటు చేస్తామన్నారు. ప్రతి మండలంలో నవోదయ విద్యాలయాలతో సమానంగా బీసీలకు ఒక కొత్త గురుకులం, ప్రతి జిల్లాలో ఒక కొత్త డిగ్రీ కళాశాల ఇస్తామన్నారు. ర్యాంక్‌తో సంబంధం లేకుండా రూ.3 లక్షల కంటే తక్కువ వార్షిక ఆదాయం ఉన్న బీసీ కుటుంబాలకు మొత్తం ఫీజు రీ యింబర్స్‌మెంట్ ఇస్తామని హామీ ఇచ్చారు. ఉన్నత చదువులు చదువుకునే విద్యార్థులందరికీ రూ.10 లక్షల వరకు వడ్డీ లేని రుణ సదుపాయాన్ని కల్పిస్తామన్నారు. కానీ, వాటికి తగ్గట్టుగా నిధుల కేటాయింపు మాత్రం జరుపలేదు.

**తెలంగాణ ఉద్యమంలో చనిపోయిన విద్యార్థి అమరవీరులకు రూ.25,000 పింఛన్ ఇస్తామన్న హామీని కూడా మర్చిపోయింది. 18 ఏండ్లు పైబడి చదువుకునే విద్యార్థినులకు ఎలక్ట్రిక్ స్కూటర్లు అందజేస్తామని మాట తప్పింది. ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ విద్యార్థులు 10వ తరగతి పాసయితే రూ.10,000, ఇంటర్ పాసయితే రూ.15,000, గ్రాడ్యుయేషన్ పూర్తిచేస్తే రూ.25,000, పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేస్తే రూ.లక్ష, ఎంఫిల్, పీహెచ్‌డీ పూర్తిచేస్తే రూ.5 లక్షలు అందజేస్తామని హామీ ఇచ్చి నిన్నటి బడ్జెట్‌లో ఒక్క రూపాయి కూడా కేటాయించకపోవడం దారుణం. యూనివర్సిటీల్లో చదువుకునే విద్యార్థులకు రూ.10 వేల ఫెలోషిప్ ఇస్తామన్నారు. విదేశీ యూనివర్సిటీల్లో చదువుకునే ప్రతి ఎస్సీ, ఎస్టీ, విద్యార్థికి ఆర్థిక సహాయం అందజేస్తామన్నరు. కానీ నిధుల కేటాయింపు మాత్రం శూన్యం.**

రాష్ట్ర బడ్జెట్ రూ.304,965 కోట్లతో ప్రవేశపెట్టి విద్యారంగానికి కేవలం రూ.23,108 కోట్లు మాత్రమే కేటాయించారు. దీంతోపాటు కాంగ్రెస్ పార్టీ కలల ప్రాజెక్టుగా చెప్పుకొంటున్న 'యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్'కు రూ.11,600 కోట్లు, వీరనారి చాకలి ఐలమ్మ మహిళ విశ్వవిద్యాయానికి రూ.550 కోట్లు మాత్రమే కేటాయించారు. రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి 15 శాతం నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చి నేడు 7.57 శాతమే కేటాయించారు. ఈ అరకొర నిధులు ఉద్యోగుల జీతభత్యాలకు కూడా సరిపోవు. దీంతో వీరు మ్యానిఫెస్టోలో పెట్టిన ప్రతి మండల కేంద్రానికో హైస్కూల్, జూనియర్ కాలేజీ, ప్రతి నియోజకవర్గంలో డిగ్రీ కాలేజీ, ప్రతి జిల్లా హెడ్‌క్వార్టర్‌లో పీజీ కాలేజీ నిర్మించడం ఎలా సాధ్యమవుతుందో రాష్ట్ర ప్రభుత్వమే చెప్పాలి. రాష్ట్రంలో ఉన్న ప్రతిష్ఠాత్మక యూనివర్సిటీలు ఉస్మానియా, కాకతీయ, తెలంగాణ మహాత్మా గాంధీ, జేఎన్టీయూ తదితర యూనివర్సిటీలు నిధుల కొరతతో తీవ్ర ఇబ్బందుల పాలవుతున్నాయి. కనీసం మౌలిక వసతులు లేవు. యూనివర్సిటీ విద్యార్థులు కూడా నిధుల లేమితో నాణ్యమైన భోజనం, వసతిని కోల్పోతున్నారు. కనీస వసతులైన మూత్రశాలలు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అలాంటి వర్సిటీలకు నిధులు కేటాయించాల్సిన రాష్ట్ర ప్రభుత్వం కనీసం ప్రస్తావన కూడా చేయకపోవడం శోచనీయం. మెరుగైన రీతిలో ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ తన 16 నెలల పరిపాలన కాలంలో ఒక్క రూపాయి కూడా కేటాయించలేదు. దాదాపు రూ.8 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ స్కాలర్‌షిప్స్ పెండింగ్‌లో ఉన్నాయి. ఇవి విడుదల కాక అనేక మంది విద్యార్థులు ఇబ్బందులు పాలవుతున్నారు. ఆర్థిక భారంతో చదువులకు దూరమవుతున్నారు. ఈ నిధులను విడుదల చేయడానికి ప్రత్యేక గ్రాంట్లను విడుదల చేయాల్సిన ప్రభుత్వం అసలు వాటి ప్రస్తావనే చేయకపోవడం మోసపూరిత విధానం. ఈ నిధులతో విద్యారంగాన్ని ఏ విధంగా బాగు చేస్తారో స్పష్టం చేయాల్సిన బాధ్యత రేవంత్ సర్కార్‌పై ఉన్నది.

డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చెప్పిన గొప్ప మాటలతో విద్యారంగ అంశాలను ప్రస్తావించినా ఆచరణలో మాత్రం వాటికనుగుణంగా లేవు. కాబట్టి, ప్రభుత్వ మాటలను ఎవరూ విశ్వసించరు. విద్యా రంగాన్ని కాపాడుకోవడానికి విద్యావేత్తలు, మేధావులు, విద్యార్థి సంఘాల నాయకులు, ప్రగతిశీల విద్యార్థులు ఐక్యంగా ఉద్యమించి రేవంత్ సర్కార్ మెడలు వంచాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది. తద్వారా విద్యారంగాన్ని కాపాడుకుందాం.

**(వ్యాసకర్త: పీడీఎస్‌యూ జాతీయ నాయకులు)**


---

# పైసకు కరువొచ్చింది!

**మన దేశంలోని 100 కోట్ల మందికి కనీస ప్రాథమిక అవసరాలకు మించి కావలసిన వస్తువులను కొనుగోలు చేసే శక్తి లేదు. తమ సంతోషానికి అవసరమైన వస్తువులను కొనుగోలు చేయలేక అటు సంతోషానికి, ఇటు దుఃఖానికి మధ్య వారు కొట్టుమిట్టాడుతున్నారు. ఇదీ మన దేశంలోని పరిస్థితి. ఇక ఇప్పుడు తెలంగాణ రాష్ట్ర విషయానికి వద్దాం. అరువై ఏండ్ల వలస పాలనలో తెలంగాణ ప్రాంత ప్రజల చేతులకున్న సంకెళ్లు రాష్ట్ర ఆవిర్భావంతో పటాపంచలయ్యాయి.**



**గంగుల కమలాకర్**




**2014** జూన్ 2న తెలంగాణ ఆవిర్భవించడం, ఆ తర్వాత విజ్ఞులైన తెలంగాణ ప్రజలు రాష్ట్ర పాలనా పగ్గాలు ఉద్యమ సారథి కేసీఆర్‌కే అప్పగించడంతో రాష్ట్రంలో ఇటు అభివృద్ధి కార్యక్రమాలు, అటు సంక్షేమ పథకాలు జోడెడ్లలా పరుగులు తీశాయి. 'మిషన్ కాకతీయ' పథకంతో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న చెరువులు పూడికతీత, మరమ్మతుల వంటి పనులతో చెరువులు కొత్తరూపును సంతరించుకున్నాయి. ఇదొక్కటే కాదు, ఇంటింటికీ నల్లా నీరు, రైతుబంధు, రైతుబీమా, రుణమాఫీ, కల్యాణ లక్ష్మి, కేసీఆర్ కిట్, దళితబంధు, బీసీబంధు వంటి అనేక సంక్షేమ పథకాలు రైతు, బహుజనుల అభివృద్ధి కేంద్రంగానే అమలయ్యాయి. దీంతో ఉత్పత్తి కులాలకు ఉపాధి లభించింది. ఉదాహరణకు చేప పిల్లల పంపిణీని తీసుకుంటే... చేపలు పెద్దయ్యాక ముదిరాజు బిడ్డలు ఎప్పటికప్పుడు ఆ చేపలను వల వేసి పట్టుకుంటూ రోజువారీగా ఉపాధి పొందడం మనం చూశాం. గొల్లకుర్మలకు గొర్ల పంపిణీ వంటి కార్యక్రమాలతో ఏటికేడు వారికి ఉపాధి పెరుగుతూ వచ్చింది. ఇలా ఏ సంక్షేమ పథకం తీసుకున్నా... గత బీఆర్ఎస్ ప్రభుత్వం సబ్బండ వర్గాలకు ప్రత్యక్షంగానో, పరోక్షంగానో ఉపాధి కల్పిస్తూనే వచ్చింది.

**వృద్ధులు, వికలాంగులు, వితంతువులు, ఒంటరి మహిళలకు, బీడీ కార్మికులకు ఆసరా పింఛన్లు అందిస్తూ అండగా నిలిచింది. తద్వారా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పేద ప్రజల చేతుల్లోనూ ఎంతోకొంత డబ్బు కనిపించింది. పేదల చేతుల్లో పైసలు చెలామణి అయ్యాయి. కానీ, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభు త్వం కొలువుదీరాక పైసక్కరువొచ్చింది. పైసలు కనపడక ప్రజలు ఆపసోపాలు పడుతున్నారు.**

పాలనపై కనీస అవగాహన లేని రేవంత్ రెడ్డి హయాంలో ప్రజల పరిస్థితిని ఒకసారి ఊహించుకోండి. అంతకుమించి అనక తప్పని పరిస్థితి. ఇందుకు కారణం ఒక్క ముక్కలో చెప్పాలంటే.. స్వపాలనలో తెలంగాణ సంపద ప్రజలకే చెందేది. ఢిల్లీ పాలకుల చేతుల్లో కీలు బొమ్మలైన కాంగ్రెస్ నాయకులు తెలంగాణ సంపదను ఇప్పుడు ఢిల్లీకి మూటలు మోస్తున్నారు. అందుకే తెలంగాణలో పైసక్కరువొచ్చింది. సుమారు పదకొండేండ్లుగా అధికారం లేక దోమలు కొట్టుకుంటున్న ఢిల్లీలోని కాంగ్రెస్ నాయకులకు తెలంగాణ ఒక ఏటీఎంలా మారింది.

కాంగ్రెస్ అంటే మొదట గుర్తుకువచ్చేది స్కీముల పేరిట చేసే స్కాములు. రేవంత్ రెడ్డి నేతృత్వంలో తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి సుమారు ఏడాదిన్నర కావస్తున్నది. 6 గ్యారెంటీలు, 420 హామీలు ఇచ్చి గద్దెనెక్కిన కాంగ్రెస్.. వాటిని అమలుచేసేందుకు అష్టకష్టాలు, ఆపసోపాలు పడుతున్నది. ఇచ్చిన హామీలు, చేసిన వాగ్దానాలు, స్కీములు అమలు చేయడానికి ఏం చేయాలో సర్కార్‌కు అంతుచిక్కడం లేదు.. సచివాలయం కింద లంకె బిందెల కోసం బుల్డోజర్లతో తవ్వుతూ వెతికిన రేవంత్ రెడ్డికి కనీసం ఖాళీ బిందెలైనా దొరకకపోవడంతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నాడు. అందుకే ఆయన ఖజానా ఖాళీ అయిందని మాటిమాటికి చెప్తూనే, సంపదను సృష్టించవచ్చనే విషయాన్ని మరిచిపోతున్నాడు.

ఖాళీ ఖజానాను నింపుకొనేందుకు కాంగ్రెస్ అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నది. ప్రభుత్వ పెద్దల కమీషన్లు, అధికార పార్టీ నేతల అక్రమ దందాలకు తోడు రేవంత్ రెడ్డి అవగాహనా రాహిత్యం, అర్థం పర్థం లేని విధానాలతో ప్రజల జేబులకు చిల్లులు పడ్డాయి. రేవంత్ రెడ్డి సర్కారు అసంబద్ధమైన చర్యలతో చేసేందుకు పనులు లేక, చేతిలో పైసలు లేక ప్రజలు అల్లాడుతున్నారు.

రేవంత్ రెడ్డి సర్కార్ తీసుకొచ్చిన హైడ్రా కారణంగా హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ రంగం ఘోరంగా పతనమైంది. కొత్త ప్రాజెక్టుల సంగతి దేవుడెరుగు, ఉన్నవాటిని ఊడగొట్టకుంటే చాలనే పరిస్థితి వచ్చింది. మహానగరం చుట్టుపక్కల ఉన్న ప్లాట్లన్నీ ముండ్ల కంపలతో నిండిపోయాయి. కొనేవారు లేక ప్లాట్లు బూజు పట్టిపోతున్నాయి. రియల్ రంగంపై ప్రత్యక్షంగా, పరోక్షంగా ఆధారపడిన బిల్డర్లు, రియల్టర్లు, నిర్మాణరంగ కార్మికులు మొదలుకొని సిమెంటు, ఇసుక, ఇటుక వంటి అనేక పరిశ్రమలు కుదేలయ్యాయి. వాటిలో పనిచేసే కార్మికులు చేతిలో చిల్లిగవ్వ లేక రోడ్డున పడ్డారు. పైసలు లేక అక్కడక్కడా ఆత్మహత్యలు చేసుకుంటున్న పరిస్థితులు దాపురిస్తున్నాయి. రియల్ రంగం ఒకటే కాదు, తెలంగాణలోని అన్ని రంగాల పరిస్థితి ఇంతే. పెట్టుబడి సాయం అందక, రుణ మాఫీ పూర్తిస్థాయిలో అమలుకాక, నీళ్లు లేక పంటలు ఎండిపోతున్నాయి. రైతన్నలు అప్పుల పాలవుతున్నారు. నేతన్నల సాంచల సప్పుడు ఆగిపోయి వారికి సైతం పైసక్కరువొచ్చింది. ఉచిత బస్సు కారణంగా ఆటో డ్రైవర్ల జేబులు ఖాళీ అయ్యాయి. ఆటో డ్రైవర్లు సైతం ఆత్మహత్యలకు పాల్పడటం కన్నీరు తెప్పిస్తున్నది. కనీసం ఆర్టీసీ అయినా బాగుపడిందా అంటే అదీ లేదు.


**మహాలక్ష్మి పథకం వల్ల ఆర్టీసీ ఆక్యుపెన్సీ పెరిగింది తప్ప, ఆదాయం ఏ మాత్రం పెరగలేదు. ఉచిత బస్సు పథకం సొమ్మును చెల్లించేందుకు ప్రభుత్వానికి చేతులు రాకపోవడంతో ఆర్టీసీకి డీజిల్‌కు కూడా పైసలు ఎల్లడం లేదు. మినీ అంగన్వాడీ టీచర్లు, హోంగార్డులు, ఎక్సైజ్ సిబ్బంది మొదలుకొని అనేక శాఖల ఉద్యోగులకు ప్రభుత్వం జీతాలు సరిగా ఇవ్వడం లేదు. దీంతో ఆయా కుటుంబాలు నెలల తరబడి పస్తులుంటున్నాయి. ఇలా చెప్పుకుంటూపోతే రాష్ట్రంలోని ప్రజలది ఒక్కొక్కరిది ఒక్కో శర. అనేక వర్గాలు చేతిలో పైసలు లేక కొనుగోలు శక్తిని కోల్పోయి తిండికి నోచుకోవడం లేదు.**

కేసీఆర్ హయాంలో పదేండ్ల పాటు తెలంగాణ ఖజానా నిండుకుండలా తొణికిసలాడింది. కానీ, రేవంత్ రెడ్డి అసమర్థత కారణంగా రాష్ట్ర ఆదాయం గణనీయంగా పడిపోయింది. రిజిస్ట్రేషన్ సహా అనేక శాఖల రాబడి తగ్గిపోయింది. జీఎస్టీ వసూళ్లలో తెలంగాణ అట్టడుగున నిలిచింది. కేసీఆర్ పాలనలో ఇతర దేశాలతో పోటీపడిన తెలంగాణ... ఇప్పుడు మన దేశంలోని చిన్న చిన్న రాష్ట్రాలతో కూ డా పోటీ పడలేని దుస్థితికి చేరింది. రేవంత్ రెడ్డి అమలు చేస్తున్న విధానాలను చూస్తుంటే తెలంగాణ ఖజానా, వ్యాపారుల గల్లా పెట్టెలు, ప్రజల చేతుల్లో పైసలు ఇక ఎప్పటికీ కనపడవేమోనని అనిపిస్తున్నది.

**(వ్యాసకర్త: రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మాజీ మంత్రివర్యులు)**

**ఖాళీ ఖజానాను నింపుకొనేందుకు కాంగ్రెస్ అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నది. ప్రభుత్వ పెద్దల కమీషన్లు, అధికార పార్టీ నేతల అక్రమ దందాలకు తోడు రేవంత్ రెడ్డి అవగాహనా రాహిత్యం, అర్థం పర్థం లేని విధానాలతో ప్రజల జేబులకు చిల్లులు పడ్డాయి. రేవంత్ రెడ్డి సర్కారు అసంబద్ధమైన చర్యలతో చేసేందుకు పనులు లేక, చేతిలో పైసలు లేక ప్రజలు అల్లాడుతున్నారు.**

---




---



## దక్షిణాదిని శిక్షించడమే!

**కేరళ సంతానోత్పత్తి రేటు 1.8, తమిళ నాడు 1.7 మాత్రమే. అదే సమయంలో ఉత్తరప్రదేశ్ సంతానోత్పత్తి రేటు 2.4 కాగా.. బీహార్ 3. తమిళ నాడు, కేరళ వంటి రాష్ట్రాలు జనాభా నియంత్రణను విజయవంతంగా పాటించగా.. యూపీ, బీహార్ తదితర రాష్ట్రాలు పట్టించుకోలేదు. జనాభా ఆధారంగా డీలిమిటేషన్ చేపట్టడమంటే.. జనాభా నియంత్రణలో సక్సెస్ అయిన రాష్ట్రాలను శిక్షించడమే.**

**- విల్సన్, రాజ్యసభ ఎంపీ, తమిళ నాడు**

---




# హామీల ఎగవేతకు అద్దం పట్టిన బడ్జెట్

**2025-26 కోసం తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ రాష్ట్ర ప్రజలను తీవ్ర నిరాశకు గురిచేసింది. గత ప్రభుత్వ హయాంలో పలు సంక్షేమ, అభివృద్ధి వల్ల తలసరి ఆదాయం రూ.3,79,751 లక్షలకు చేరిందనే విషయం అందరికీ తెలిసిందే. గత 16 నెలల పాలనలో ప్రజల తలసరి ఆదాయం గణనీయంగా పడిపోయింది. రెవెన్యూ రాబడి తగ్గిపోయింది. ప్రజల కొనుగోలు శక్తి హరించింది. అస్తవ్యస్థ విధానాలతో పరిపాలన పూర్తిగా గాడి తప్పిందని అసెంబ్లీలో ఆర్థికమంత్రి భట్టి విక్రమార్క ప్రవేశ పెట్టిన 2025-26 బడ్జెట్ స్పష్టం చేసింది. తలసరి ఆదాయం 2014-15లో 1,24,104 నుంచి 2023-24 వరకు 3,47,299కి పెంచిన ఘనత కేసీఆర్ నేతృత్వంలోని గత బీఆర్ఎస్ ప్రభుత్వానిది. కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీ, రైతుబంధు లాంటి పథకాలను 30 శాతం మంది రైతులకే అమలు చేసి మెజారిటీ రైతులకు ఎగ్గొట్టింది. కానీ, భట్టి ప్రసంగంలో మాత్రం అబద్ధాల పరంపర కొనసాగింది.**

రాష్ట్ర బడ్జెట్‌లో వ్యవసాయరంగం అత్యంత కీలకమైనది. ఆ రంగానికి ప్రభుత్వం కేటాయించింది. రూ.24,439 కోట్లు మాత్రమే. రూ.18,000 కోట్లు రైతుబంధు పథకం కింద కేటాయింపు చేసింది. ఎకరానికి రూ.10 వేల నుంచి రూ.12 వేలకు పెంచారు కానీ, కేటాయింపులు మాత్రం తగ్గట్టుగా లేవు. బోనస్, బీమా, వ్యవసాయ సబ్సిడీలలో అన్నీ కోతలే. రాష్ట్ర బడ్జెట్‌లో మరో కీలకమైనది విద్యారంగం. బడ్జెట్‌లో 15 శాతం విద్యకు నిధులు కేటాయిస్తామని చెప్పి 7.57 శాతం అంటే, 23,108 వేల కోట్లు మాత్రమే కేటాయించారు. యూనివర్సిటీల అభివృద్ధి కోసం రూ.500 కోట్లు మాత్రమే కేటాయించారు. వైద్య రంగానికి రూ.12,393 కోట్లు కేటాయించడం వల్ల పెద్దగా ప్రయోజనం లేదు. కామారెడ్డి డిక్లరేషన్‌లో బీసీలకు ఏటా రూ.20 వేల కోట్లు కేటాయిస్తామని చెప్పి, ఇప్పుడు రూ.11,405 కోట్లు మాత్రమే కేటాయించింది. దీంతో బీసీ సామాజిక వర్గాలకు తీవ్ర అన్యాయం జరిగింది. యాభై లక్షల మందికి 200 యూనిట్ల విద్యుత్తు ఉచితంగా, రూ.500లకే గ్యాస్ సిలిండర్ ఇస్తున్నామని చెప్పి ఈ బడ్జెట్‌లో మాత్రం నామమాత్రంగా కేటాయింపులు చేసి చేతులు దులుపుకున్నారు. అమరవీరుల కుటుంబాలకు పింఛన్, ప్రతి మహిళకు 2,500 పథకం కోసం అసలు కేటాయింపులే జరపలేదు. పింఛన్ హెచ్చింపు లేదు. నిరుద్యోగ భృతి ప్రస్తావనే లేదు. ఒక్క మాటలో చెప్పాలంటే 6 గ్యారెంటీల పేర 420 హామీల అమలులో ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదనే విషయాన్ని ఈ బడ్జెట్ కేటాయింపులు స్పష్టంగా చెప్తున్నాయి.

ఉద్యోగులు పీఆర్సీ కోసం, 5 కరువు భత్యాల విడుదల కోసం ఎదురుచూస్తున్న తరుణంలో ఈ బడ్జెట్‌లో వాటికి సంబంధించిన ఊసే లేదు. రిటైర్డ్ ఉద్యోగుల పెన్షన్ ప్రయోజనాల విషయమై అసలు ప్రస్తావనే రాలేదు. స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసెంబ్లీ సాక్షిగా జీతాలు తప్ప ఏవీ అడగొద్దని హుకూం జారీ చేయడంతో ఉద్యోగ వర్గాల్లో ఆందోళన మొదలైంది. పీఆర్సీ గడువు ముగిసి దాదాపు రెండేండ్లు గడిచింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన మధ్యంతర భృతిని కూడా పెంచలేదు. ముఖ్యమంత్రి రేవంత్ పరోక్షంగా పీఆర్సీని మరిచిపోవాలని చెప్పారు. కావాలంటే బడ్జెట్ మీ చేతుల్లో పెడతాను మీరే పంచుకోండని ఉద్యోగులకు చెప్పడం హాస్యాస్పదం. 2025-26లో మరో 10 వేల మంది ఉద్యోగులు రిటైర్డ్ కాబోతున్నారు. వీరి పరిస్థితి ఏంటో ఊహించుకుంటే ఆందోళన మొదలవుతున్నది. ఆర్థిక ప్రయోజనాలు అడిగిన పాపానికి జీవితమంతా శ్రమించి దశాబ్దాల కాలం ప్రభుత్వానికి సేవలందించిన ఉద్యోగుల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరి సరిగా లేదు. అందుకే అన్ని వర్గాలు ఉద్యమ బాట పట్టే అనివార్య పరిస్థితి నెలకొన్నది. ప్రభుత్వ పాలన గాడితప్పి ప్రజా వ్యతిరేక విధానాల వల్ల సొంత రెవెన్యూ రాబడి కూడా గణనీయంగా తగ్గింది. కేంద్రం నుంచి బ్రహ్మాండంగా నిధులు వస్తున్నాయని గవర్నర్ ప్రసంగం సందర్భంగా చెప్పిన మాటలు ప్రజలు గమనిస్తున్నారు. కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు గాడిద గుడ్డు ఇచ్చిందని చెప్పిన రేవంత్‌రెడ్డి తన సమర్థత వల్ల కేంద్రం నుంచి అనేక ప్రయోజనాలు పొందానని చెప్పడం ద్వారా బీజేపీ పట్ల ప్రజల్లో వ్యతిరేకత రాకుండా చూడటమే కదా? జాతీయ పార్టీలైన కాంగ్రెస్, బీజేపీలు ఒక్కటై బీఆర్ఎస్‌ను రాజకీయంగా అణచివేయాలనే కుట్రలో భాగమే ఇది. మహాత్మా గాంధీ, అంబేద్కర్ స్ఫూర్తితో ప్రజాపాలన సాగిస్తున్నామని, పారదర్శకత, జవాబుదారీతనం మా విధానమని చెప్తున్న ప్రభుత్వం గత 16 నెలల కాలంలో కొనసాగిన ప్రజా వ్యతిరేక పాలనకు ఎవరు కారణమో చెప్పాలి.

మొత్తంగా 2025-26 కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్ ఎగవేతలకు అద్దం పట్టింది. ఓ దిక్కు మేమెంతో.. మాకంత కావాలని అన్ని వర్గాలు పోరాడుతుంటే... ఇంకో దిక్కు ఆయా వర్గాలకు న్యాయం జరిగేలా కేటాయింపులు మాత్రం జరగలేదు. గత ప్రభుత్వం సకల సంపదలతో రాష్ట్రాన్ని అప్పచెప్తే, కాంగ్రెస్ ప్రభుత్వం సకల సమస్యలు సృష్టించి ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నది. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు హామీ ఇచ్చిన ప్రకారం బడ్జెట్ కేటాయింపులు జరుపలేదు. తెలంగాణ ప్రజలకు ఇచ్చిన మాట నూటికి నూరుపాళ్లు తప్పింది. భవిష్యత్తు పాలనకు అద్దం పట్టేలా తేల్చిచెప్పింది. ఇక తేల్చుకోవాల్సింది ప్రజలే. ప్రజలే చరిత్ర నిర్మాతలు. తెలంగాణ భవిష్యత్తు చరిత్రను ఇక ప్రజలే నిర్ణయిస్తారు.



**జి.దేవీప్రసాద్ రావు, కార్పొరేషన్ మాజీ చైర్మన్**